విద్యాసాగర్ గారి ప్రవచనాలు

http://sadhakudu.blogspot.in

https://groups.google.com/forum/#!forum/sadhakudu

త్రిగుణములు

సత్వ, రజో, తమో గుణములను త్రిగుణములు అంటారు. తమస్సును రజోగుణముచేత, రజోగుణమును సత్వగుణముచేత, బ్రహ్మజ్ఞానముచే గుణాతీత స్థితికి చేరుకొనుట ద్వారా సత్వగుణమును అధిగమించవలెను. త్రిగుణములే మాయ. త్రిగుణముల వ్యక్తరూపమే ఈ సృష్టి అంతా. సాధన అంతా గుణములను మార్పుచేసికొనుట, వాటిని అదిగమించుట, తదుపరి అతీతము అగుటలోనే దాగి ఉన్నది.

ఆ విధమైన సాధన చేయవలెనన్న ముందు మూడు గుణములు దృష్ట్యా ప్రపంచాన్ని , నీ మనో బుద్ధులను అర్థము చేసికొనటము అలవడాలి. అర్థము చేసికొని గుణముల దృష్ట్యా అన్నింటిని గుర్తించాలి. గుర్తిస్తే అవాగాహన కలుగుతుంది. ఆ అవాగాహనతో విచారణ చెయ్యాలి. విచారణ చేసిన దానిని ఆచరణలో పెట్టాలి. ఆచరణ వలన అనుభవము వస్తుంది. అనుభవము కలిగిన తరువాత ఆ అనుభవము సహజము అవ్వాలి. ఇదే సాధకునిలో జరుగ వలసిన పరిణామ క్రమము.

మనలోని గుణముల యొక్క వ్యక్తీకరణయే పరిస్థితులు. నీవు చేసే పని జపము కావచ్చు , యజ్ఞము కావచ్చు , తపము కావచ్చు , ధ్యానము కావచ్చు, పని ఒకటే కావచ్చు కాని వాటిని చేయుట వెనుక ఉన్న గుణ ప్రేరణలు మారుతూ ఉంటాయి. అందువలన అవి పరిపరి విధములుగా కనపడుచు ఉంటాయి. మనము పని చేయుట వెనుక ఏ గుణ ప్రేరణ ఉన్నదో గుర్తించగలిగిన గుణములను మార్పుచేసుకొని వాటిని అధిగమించవచ్చు.

విషయము మీద కాంక్ష ఉంటే రజోగుణము. మనస్సును ఆశ్రయిస్తే అది రజోగుణము. 'మనస్సు నేను' అనుట రజోగుణ లక్షణము. రజోగుణముతో వ్యవహరించే వాడు మనో పరిధిలో ఉంటాడు. అంటే మనస్సు, దాని భావోద్వేగములతో తాదత్మ్యత చెంది వ్యవహరిస్తూ ఉంటాడు. రజోగుణ పరిధిలో ఉన్నవాడు తన సుఖమే కావాలి , నా సుఖమే నాకు ప్రధానం. ఎదుటివాడు ఏమైపోయినా నాకు సంబంధం లేదు అంటాడు. స్వార్థపూరితమైన అహంకారముతో వ్యవహరిస్తూ ఉంటాడు. ఉదాహరణకు బస్సులో కొద్దిగా నువ్వు సర్దుకో, అతను చాలాసేపునుండి నుంచొని ఉన్నాడు, ఇబ్బంది పడుచున్నాడు అని ఎవరైనా అంటే రజోగుణములో ఉన్నవాడు "నేను సర్దుకోను.నేను సర్దుకుంటే నాకు ఇబ్బంది" అంటాడు.

విషయము మీద కాంక్ష బలపడిపోతే తమోగుణము. ఇంద్రియములను ఆశ్రయిస్తే తమోగుణము. 'శరీరమే నేను' అనుట తమోగుణ లక్షణము. తమోగుణంతో వ్యవహరించే వాడు శరీర పరిధిలో ఉంటాడు. అంటే ఒక పనిని ఆచరించక, ఒక వస్తువును పొందక నేను ఉండలేను అనే మోహముతో జీవిస్తూ ఉంటాడు. తమోగుణ వ్యవహారము

మోహపూరితమై ఉంటుంది. ఉదాహరణకు నాకు బజ్జీలు కావాల్సిందే అన్నప్పుడు, నీ కడుపులో అల్సర్ ఉంది తినకూడదు, డాక్టర్ తినకూడదు అన్నాడు అని పెద్దలు చెప్పారు. కాని నేను మిరపకాయ బజ్జీ తినకుండా ఉండలేను, బజ్జీల బండి కనబడితే ఆగకుండా ఉండలేను అన్నావనుకో.. . అప్పుడు నీవు తమోగుణ పరిధిలో ఉన్నట్లు.

విషయము మీద కాంక్ష లేకపోతే సత్వగుణము. 'బుద్ధిని నేను' అని అంటే అది సత్వ గుణము. సత్వ గుణముతో వ్యవహరించే వాడు బుద్ధి పరిధిలో ఉంటాడు. సత్వగుణముతో జీవించే వాడిలో త్యాగబుద్ధి ఉంటుంది. మంచి లక్షణాలను ఎన్నింటిని పేర్కొంటామో అవన్నీ సత్వగుణము క్రిందకే వస్తాయి . సహనం, శాంతం, ఓర్పు, దయ సానుభూతి, సహాయం, సేవ, సత్యం, ధర్మం, అహింస, ప్రేమ మొదలగు లక్షణాలన్నీ సత్వగుణమునకు సంబంధించినవే.

వీటిలో ఏ లక్షణములతో ప్రవర్తిస్తున్నాము మోహముతోనా, స్వార్ధముతోనా లేక త్యాగముతోనా అనుదానిని బట్టి ఏ గుణముతో ప్రవర్తిస్తున్నామో సులువుగా గుర్తించవచ్చు. గుర్తించిన తరువాత వాటిని మార్పు చేసికోవాలి.

రోజువారి జీవితంలో ముందు రజో తమో గుణములను గుర్తించి, వాటిని వ్యక్తీకరించక పరిష్కరించు కోవాలి. ఉదాహరణకు నీకు కోపము వచ్చినది. దానిని వ్యక్తీకరించక విచారణ చెయ్యాలి. దానికి వ్యతిరేఖమైన వేదాంత వాక్యాన్ని ఆశ్రయించాలి. క్రోధము వచ్చినప్పుడు 'సహనమున తరగని శాంతి లేదే' అనే వేదాంత వాక్యాన్ని ఆశ్రయించు. ఈ విధముగా నీకు సమస్యలు ఎన్నైతే ఉన్నాయో, ఎన్ని రజోగుణ విషయాలున్నాయో, ఎన్ని తమోగుణ విషయాలు ఉన్నాయో వాటినన్నింటిని పరిష్కరించటానికి కావలసిన తద్వ్యతిరేఖ వేదాంత వాక్యాలను కూడా నీవు కలిగి ఉండాలి. అవి ఎంత బలంగా నీలో పనిచేస్తూ ఉండాలి అంటే రజో తమో గుణమునకు సంబంధించిన లక్షణములు తోచినప్పుడల్లా వాటికి వ్యతిరేఖమైన వేదాంతవాక్యములు కూడా నీకు తోచాలి. ఆ విధమైన వేదాంతవాక్యములను గురువు బోధించేటప్పుడు , శాస్త్రాన్ని అధ్యయనం చేసేప్పుడు జాగ్రత్తగా ఏరి పెట్టుకోవాలి. ఈ వేదాంత వాక్యాలని ఆ విషయాల యొక్క ప్రభావం వచ్చినప్పుడల్లా వాటిమీద ప్రయోగించాలి. ప్రయోగిస్తే నీలోపల దైవీ గుణాలు, ఆసురీ గుణాల మధ్య ఒక సంఘర్షణ వాతావరణం ఏర్పడుతుంది. విచక్షణా జ్ఞానంతో నీవోటు ఎటు వేస్తే అవే బలపడతాయి. సంఘర్షణ ఏర్పడినప్పుడు నీవు నాకు గురువాక్యము, శాస్త్రవాక్యమే శిరోధార్యం అని కట్టుబడి ఉండాలి. అప్పుడు రజోతమోగుణ ప్రభావమునుండి బయటపడగలుగుతావు.

రజోతమోగుణ ప్రభావమునుండి బయటపడి సత్వగుణములో స్థిరపడవలెనన్న బుద్ధి పరిధిలో జీవించుట అలవరచుకోవాలి. మొదట బుద్ధిని భావోద్రేకములకు లోబడి మనస్సుతో పాటు పనిచేయుటను మానిపించి వెనక్కి మరల్చుకోవాలి. విచక్షణాజ్ఞానమును, వివేకమును ఉపయోగించి అనుదిన జీవితములో మంచి లక్షణములకు మాత్రమే టిక్ పెట్టుట అలవరచుకోవాలి.

అధర్మానికి టిక్ పెట్టకూడదు. ధర్మానికి టిక్ పెట్టాలి.

అసత్యానికి టిక్ పెట్టకూడదు. సత్యానికే పెట్టాలి.

సహనానికే టిక్ పెట్టాలి. క్రోధానికి టిక్ పెట్టకూడదు.

ఓర్పుకే టిక్ పెట్టాలి, అసూయా ద్వేషాలకు టిక్ పెట్టకూడదు.

వైరాగ్యానికే టిక్ పెట్టాలి, అనురాగానికి టిక్ పెట్టకూడదు.

ఈ విధముగా విషయములు, జ్ఞాపకములు, గుణముల ప్రేరణకు లోబడకుండా అవి క్రియారూపము ధరించకుండా వెనుకకు మరల్చుకొనగలుగుటయే ఇంద్రియ నిగ్రహం అంటే. అనుదిన జీవితమున సత్వగుణముతో జీవిస్తూ తమోగుణ రజోగుణ ఆచరణ నుంచి విరమించకొనగలుగుట, వెనక్కుతీసికొనగలుగుటయే ఇంద్రియ నిగ్రహము అంటే.

మరియొక కోణము నుండి గుణములను పరిశీలించిన తమో, రజోగుణములను ఆశ్రయించి ప్రవర్తించిన ఆచరణలో ప్రత్యేకత లేక విశేషత ఉంటుంది. రజో తమోగుణములతో జీవించువారు నాకు ఇదే కావాలి, ఫలానా సమయమునకు కావాలి, నాకు ఇలా ఉంటేనే సుఖముగా ఉంటాను అని all conditions imposed జీవితమును కొనసాగిస్తూ ఉంటారు. ప్రత్యేకతలతో కూడిన జీవితమును కోరతారు. ప్రత్యేకత లేక విశేషతయే బలహీనత. ఆయా విషయములలో ప్రత్యేకత దేనివలన కలుగు చున్నదో గుర్తించి, దానికి వ్యతిరేఖమైన ఆచరణ చేయుట ద్వారా దానిని సామాన్యము చెయ్యాలి. అప్పుడు దానిని వెంటనే అధిగమించ గలుగుతాము. ఇదే గుణములను మార్పు చేసికొనుట అంటే.

సత్వగుణముతో జీవించువాడు ప్రత్యేకతలు అన్నీతీసివేసి సామాన్యముగా జీవిస్తాడు. సామాన్య ఆచరణ వలన, ఆచరణలో వేగము తగ్గిపోతుంది. అన్నింటిని సామాన్యముగా చూడగలిగినప్పుడు ఇష్టము, అయిష్టములతో పనిలేదు, కనుక ఇచ్ఛ ఉండదు. ఇచ్ఛలేనప్పుడు నిర్ణయము ఉండదు. ఇచ్ఛ, నిర్ణయములు లేక జీవించగలుగుటయే సత్వగుణము యొక్క ప్రధాన లక్షణము. సత్వగుణముతో జీవించువాడు అంతా నీ ఇష్టము లేక దైవేచ్ఛ అంటాడు. దైవాన్నిఆశ్రయించి జీవించుట వలన రాజసిక తామసిక బలాలను విసర్జించగలుగుతాడు. అలా జీవించునప్పుడు అలజడులకు, తగాదాలకు అవకాశమే ఉండదు కనుక ప్రశాంత జీవనమును సుఖమయ జీవనమును కొనసాగించగలుగుతాడు.

చాలామంది గుణములను గుర్తించండి అంటే తనలో ఉన్న గుణములను గుర్తిస్తారు. తనలో అజ్ఞానముతో జీవిస్తున్నప్పుడు తమో, రజోగుణములే పనిచేస్తూ ఉంటాయి. వాటిని గుర్తిస్తే ఏమి బలపడతాయి? అవే బలపడుతాయి. సాధన ప్రారంభములో రజో, తమోగుణములను గుర్తించుట ఆవశ్యకము. వాటినుండి బయటపడుటకు ఆ లక్షణములకు గుర్తించి వాటి వ్యతిరేకమైన లక్షణములతో వ్యవహరించుట తప్పదు. కాని సాధనలో కొంత ముందుకు పురోగమించిన తరువాత సత్వగుణముతో వ్యవరిస్తున్నానా లేదా అనునది పరిశీలించుకొనిన చాలు. రజో, తమోగుణములతో వ్యవహరిస్తున్నాను అనుట కన్నా సత్వగుణముతో వ్యవహరించలేదు అనుట మేలు. కనుక నువ్వు గుర్తించాల్సింది సత్వగుణమును. అంటే ప్రతిపనిని సాత్వికదృష్టితో ఆచరించుట ఎట్లా అనునది పరిశీలించుకొనుట అలవరచుకోవాలి. సత్వగుణంతో ఈ పనిని చేయటం ఎట్లా? ఈ ఆలోచనను చేయటం ఎట్లా? అని మొదట ప్రశ్న వేసికోవాలి. అప్పుడు నీవు సత్వ గుణాన్నే గుర్తు పడతావు. సత్వగుణము నీలో బలపడుతుంది.

సత్వ గుణాన్ని మాత్రమే గుర్తిస్తున్నప్పుడు సత్వగుణం బలపడి అంతరంగము పవిత్రపరచబడుతుంది. అప్పుడు నేను దైవము అభిన్నము అనే సత్యమును గుర్తించుటకు అవకాశము ఏర్పడుతుంది. రజోగుణ బలాన్ని ఆధారంగా తీసుకొని జీవించినట్లైతే జీవుడు నేనుగా ఉండి పోతావు. తమో గుణం బలం ఆధారంగా తీసుకుని జీవించినట్లైతే జగత్తుతోటి తాదాత్మ్యత చెంది జగత్తు నేనుగా ఉండి పోతావు.

అజ్ఞానము, అలసత్వము, జడత్వము, నిద్ర, ప్రమత్తత , మూఢత్వము తమోగుణ లక్షణములు. ఈ లక్షణములు మనలో పని చేయుచున్నవి అని గుర్తించిన వెంటనే వృధా కాలయాపన చేయక కార్యోన్ముఖమైన తమోగుణము నుండి రజోగుణమునకు వస్తాము. మనము చేయు పనిలో పరహితం లేకపోయిన ఆ పని తమోగుణ రూపంలోకి మారిపోతుంది. పరహితం కోరి చేస్తే తమోగుణము నిరసించబడుతుంది. రజోగుణములో స్వార్ధంతో కూడి కర్మచేయుట వలన మనస్సుతో తాదాత్మ్యత చెందుతాము. దానినుండి బయటపడవలెననిన నిస్వార్ధంగా కర్మచేయుట నీకు అలవాడాలి. నిస్వార్ధ పూరితంగా ఆలోచిస్తే రజోగుణం నిరసించబడుతుంది. నీ సుఖానికి ప్రాధాన్యత లేకుండా, నీకు ఎంత కష్టమైనా సదా పరహితమే చెయ్యాలి. నాకు కష్టం కదా అని వాయిదా వేయకుండా ఆ పనివలన ఇతరులకు శ్రేయస్సు కలిగితే ఎంత కష్టమైనా కష్టమనకుండా, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి. భగవంతునిచేతిలో పనిముట్టుగా చేయాలి. ఏ ఆలోచన అయినా ప్రసాద బుద్ధితో ఈశ్వరార్పణ భావంతో చేస్తే అందులో సత్వగుణం నిలబడుతుంది. ఈశ్వరార్పణ భావంతో, పరహితము కోరి కర్మలు చేయటం వల్ల మన: సంబంధమైన దోషాలన్నీ తొలిగిపోతాయి. లేనియెడల స్వార్ధ పూరిత మైనటువంటి మనో సంబంధమైన దోషాలు మిగిలిపోతాయి. ఆ విధముగా జీవించిన రజో, తమో గుణముల ప్రభావము నుండి బయటపడి సత్వగుణము నందు స్థిరపడతాము.

రజో, తమో గుణములు త్వరగా ఫలితాన్ని ఇచ్చినట్లు అగుపిస్తాయి. కాని అవి తాత్కాలిక మార్పు, తాత్కాలిక ఫలితాన్ని ఇస్తాయి. సత్వగుణము ఆలస్యముగా ఫలితాన్ని ఇచ్చినప్పటికీ శాశ్వత పరిష్కారాన్ని , శాశ్వత పరిణామాన్ని కలిగిస్తుంది. గుణములను మార్పు చేసికొని వాటిని అధిగమించుట అనునది ప్రతినిత్యము లేక అనునిత్యము, జీవిత పర్యంతము జరుగవలసిన నిరంతర ధ్యానము. ఈ విధమైన సాధన చేయుచున్న వారికి సృష్టిలోని ప్రతి జీవి సహాయకారియే అవుతుంది. ఎదుటివారి గుణములతో కూడిన ప్రవర్తన తనలోని లోపములను సరిదిద్దుకొనుటకు, సత్వ గుణమును అభివృద్ధి పరచుకొనుటకు సహాయకారి అవుతాయి.

గుణములను కేవలము మనలో గుర్తించడమే కాదు. ఎదుటివారితో ప్రవర్తించేటప్పుడు ఎదుటివారు ఏ గుణముతో వ్యవహరిస్తున్నారు, వారితో మనము ఎలా ప్రవర్తించాలి అనేది కూడా తెలిసిఉండాలి.

ఎదుటివానిచే మనము పనిచేయించుకోవలసి వచ్చినపుడు ఎదుటివానికి ఆ పని చేయగల సామర్థ్యము ఉన్నదో లేదో చూసుకోకుండా పని చేయించు కోవటము - తమోగుణ లక్షణము.

ఎదుటివాని సామర్థ్యము చూచి అతనిని ఒప్పించి పనిచేయించు కోవటము - రజోగుణ లక్షణము.

సత్వగుణము కలవాడు పనిని అన్ని విధములా పరిశీలించుకొని , అన్ని విధములా సంసిద్ధమైన తరువాత పనిని ప్రారంభించి, సాధమైనంత వరకు తానే పుర్తిచేసికొనుటకు ప్రయత్నిస్తాడు. సత్వగుణ పరిధిలో తాను , భగవంతుడు ఇద్దరు మాత్రమే ఉంటారు. వేరే వారిమీద ఆధార పడరు.

శక్తి ఉన్నా చెయ్యక పోవటము - తమోగుణ లక్షణము
శక్తికి మించి చెయ్యటము - రజోగుణ లక్షణము
తన శక్తికి సరిపడ చెయ్యటము - సత్వగుణ లక్షణము

సత్వగుణములో ఉన్న వానికి ఎదుటివారు పని చెప్పవలసిన అవసరము లేదు. తానే అవసరము గుర్తించి పనిచేస్తాడు.
ఎదుటివారు పని చెప్పిన తరువాత చెయ్యుట రజోగుణ లక్షణము.
చెప్పినా చెయ్యకపోవుట తమోగుణ లక్షణము

శక్తి ఉన్నా చెయ్యక పోవటము వలన బుద్ధి క్రమముగా మందగించి ప్రమాదమునకు దారి తీస్తుంది. గాఢ నిద్రావస్థలో వలె బుద్ధిని చీకటి క్రమ్మి వేస్తుంది. బుద్ధి సలహాలు ఇవ్వటము మానివేస్తుంది. సుఖము కోసము పని తప్పించుకోవటము తామసిక సుఖము. కనుక చెయ్యగల సామర్థ్యము ఉండి పని చెయ్యకుండా తప్పించుకోవద్దు. లోపమును లేక బలహీనతను గుర్తించినా మార్చుకోక పోవడము గాఢమైన తమోగుణ లక్షణము. ఈ విధమైన గాఢ

తమోగుణ లక్షణములు అధికమై ఈ శరీరము ద్వారా ఏ విధమైన పరిణామము ఇంక సాధ్యము కాదు అన్న నిర్ణయము కలిగినప్పుడు జీవుడు ఈ శరీరమును విడచిపెట్టి కొత్త శరీరమునందు ప్రవేశిస్తాడు. చైతన్యముపై ఏ గుణములు, బలహీనతలు, జ్ఞాపకములు లేక వాసనల ప్రభావము లేనప్పుడు చైతన్యము చైతన్యములో కలిసిపోతుంది. మరల శరీరమును ధరించవలసిన అవసరము ఉండదు. పై వాటిలో ఏ ఒక్కదాని ప్రభావము ఉన్నా దానిలో పరిణామము పూర్తి చేయుటకు మరల శరీరము ధరించబడుతుంది.

ఒకరికి పని చెప్పేముందు లేక సలహా ఇచ్చేముందు ఎదుటివాడు ఏ గుణములో ఉన్నాడో పరిశీలించుకోవాలి. ఏ సమయములో చెబితే పని జరుగుతుందో లేక మనము చెప్పిన మాట వింటాడో చూచుకొని చెప్పాలి. గమనించేవాడు ఎప్పుడు సత్వగుణములో ఉంటాడు . ఇలా పరిశీలించుట వలన బుద్ధి సూక్ష్మత పెరుగుతుంది

జీవుడు, జగత్తనే రజో తమోగుణాలను వదలించుకోవడానికి సత్వగుణమును ఆశ్రయించాము. కాని ఈ సత్వగుణం కూడా ఆత్మభావన యందు నిలచుటకు అడ్డంకే. ఆత్మానుభవమును పొందవలెనన్న సత్వగుణమును కూడా విడువ వలెను. సత్వగుణ పరిధిలో ఉన్నప్పుడు బుద్ధి పరిధిలో నీవు నిలువగలుగుతావు. కాని బుద్ధి స్వయంగా పనిచేయలేదు. చైతన్యం యొక్క ప్రభావం చేత బుద్ధి పనిచేస్తుంది, ఈ సత్వ గుణాన్ని వదిలేయ్యగానే ఈ బుద్ధి చైతన్యంలో కలిసిపోతుంది. క్రమేపీ బుద్ధిని పట్టుకెళ్ళి గుణాతీతం అయిన చైతన్యంలో సంయమించాలి, ఆ సంయమించటం పేరే యోగమంటే. ఆ బుద్ధి కూడా ఆత్మలో సంగమిస్తే బుద్ధి కూడా లేకుండా పోయింది. గుణాతీతంగా ఉండగలుగుతావు. ఎప్పుడైతే నీవు గుణాతీతముగా ఉన్నావో అప్పుడు ప్రజ్ఞా స్వరూపుడవు అవుతావు, ఆత్మభావన యందు సహజముగా ఉండగలుగుతావు.

వ్యవహారం సత్వగుణంతో ఉండాలి. నిర్ణయం గుణాతీతంలో ఉండాలి. అంతకంటే క్రిందకు దిగకూడదు. ఎప్పుడు చైతన్యాన్ని లేక ప్రకాశాన్ని లేక స్వరూప జ్ఞానాన్నే గుర్తిస్తూ ఉన్న, నామ రూపాత్మకమైనవి విసర్జించబడతాయి. అప్పుడు సహజంగా ఆత్మ స్వరూపుడుగా లేక చైతన్యంగా లేక ప్రజ్ఞగా ఉండగలుతావు.

---- X ----